రంజాన్ వేళలు
ఇఫ్తార్: ఆదివారం - 6:21
సహర్: సోమవారం - 5:06



నెలవంక దర్శనం

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పరమ పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం రాత్రి నెలవంక దర్శనమీయడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు ఈ నెలంతా ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఐదు పూటలా నమాజ్ అనంతరం ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. ఈ మాసంలో ధనవంతులైన ముస్లింలు దానధర్మాలు చేసేందుకు అధికంగా ప్రాధాన్యతనిస్తారు. జిల్లాలోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేసేలా ఏర్పాట్లు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా ఆచరించే ఉపవాసం, దైవ ప్రార్థనలు, క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని, ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు (మిగతా 6వ పేజీలో)



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఉగాది నాటికి 'మంచుకొండ ఎత్తిపోతల'

- రూ.66 కోట్లతో 36 చెరువులకు సాగునీరు
- ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల సాగుకు వెన్నుదన్ను
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంచుకొండ సాగునీటి ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే.. ఇటు ఉద్యాన పంటలతో పాటు, అటు ఆయిల్‌పామ్ సాగులోకి వస్తుందని, ఉగాది నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రఘునాథపాలెం మండలానికి కృష్ణ జలాలను పారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

రఘునాథపాలెం మండలంలోని మారుమూల మల్లేపల్లిలో మంచుకొండ ఎత్తిపోతల పథకం పైప్ లైన్ నిర్మాణ పనులను శనివారం మంత్రి తుమ్మల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పైప్‌లైన్ వెంట (మిగతా 6వ పేజీలో)



ఆర్‌ఎంపీల ముసుగులో అరాచకం

గ్రామీణ వైద్యం దారి తప్పింది.. కార్పొరేట్ ఆస్పత్రుల వ్యాపారధోరణిలో పయనిస్తోంది. ఇందుకు చింతకాని మండలంలో అల్ట్రాస్కానింగ్ మిషన్‌తో గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడిన ఆర్‌ఎంపీ వైద్యుల ముఠాయే సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ వ్యవహారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతోపాటు ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులను సైతం ఆశ్చర్యపరిచింది. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకుంటున్న కొందరు ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. గతంలో ఆస్పత్రుల్లో పనిచేసిన అనుభవం జోడించి ఆరోగ్యసేవలను వ్యాపారంగా మలిచి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారు.



కారులోనే అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ సెటప్

- ఊరూరూ తిరుగుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు
- ఒక్కో పరీక్షకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు
- చింతకాని మండలంలో పట్టుబడిన ముఠా తీరుపై వైద్యుల విస్మయం
- స్కానింగ్ మిషన్ ఎలా వచ్చిందో గుర్తించని పోలీసులు
- ఆడశిశువుల అబార్షన్లకు సహకరిస్తున్న ముఠా సభ్యులు
- కఠిన చట్టాలు ఉన్నా.. అమలుకు నోచుకోని వైనం
- కమీషన్ల కోసం వైద్యశాస్త్ర విలువలకు తిలోదకాలు

ఖమ్మం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కేంద్రంగా సుమారు 2 వేల మందికిపైగా ఆర్‌ఎంపీలు ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పలు ఆస్పత్రులకు ఏజెంట్లుగా ఉంటూ పేషెంట్లను పంపిస్తూ సొమ్ములు గుంజుతున్నారు. అయితే గ్రామాల్లో నిజాయితీగా పనిచేసే ఆర్‌ఎంపీలకంటే వ్యాపార భావంతో అక్రమార్జన కోసం ఖమ్మం ప్రైవేటు ఆస్పత్రులతో సంబంధాలు పెట్టుకుని పేషెంట్లను పంపించి వారి బిల్లుల్లో 50 శాతం డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లోని పేషెంట్ల అనారోగ్య పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో చేతుల కలిపి బిల్లుల్లో కమీషన్ల లబ్ధిపొందుతున్న ఆర్‌ఎంపీలు ఇప్పుడు సేవలను మరింత విస్తృతం చేశారు.

మొబైల్ పరీక్షలు

వాస్తవానికి వైద్యారోగ్యశాఖ కూడా ఇప్పటివరకు గర్భిణులకు ఎక్కడా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేపట్టడంలేదు. గర్భిణులే ఆస్పత్రులకు వెళ్లి డాక్టర్ సూచనతో స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. లింగ నిర్ధారణ పరీక్షల నిబంధనలు ప్రకారం అమ్మాయి, అబ్బాయి అన్న విషయం ఎక్కడా డాక్టర్లు కాని స్కానింగ్ సెంటర్ యజమానులు చెప్పకూడదు. గర్భంలో శిశువు కదలికలు, అవయవాలు తదితర అంశాలను మాత్రమే తెలియచేయాల్సి ఉంటుంది. శిశువు వీక్‌గా ఉంటే అందుకు అవసరమైన, మందులను డాక్టర్ సూచన మేరకు తీసుకోవాలి.

ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో చట్టపరంగా అనుమతులతో పరీక్షలు నిర్వహించాలి. అల్ట్రాస్కానింగ్ మిషన్ కొనాలంటే అందుకు సంబంధించి జిల్లా వైద్యారోగ్యశాఖ అనుమతి అది ఏ ఆస్పత్రి, (మిగతా 6వ పేజీలో)

స్కానింగ్ మిషన్ ఎక్కడిది?

గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలకు సంబంధించి అల్ట్రాస్కానింగ్ మిషన్ కొనాలంటే ఎన్నో నిబంధనలు, అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఎలాంటి అనుమతులు, నిబంధనలు లేకుండా ఈ మిషన్ ఎక్కడ కొన్నారన్న విషయంపై పోలీసులు నిందితుల నుంచి ఇప్పటివరకు రాబట్టలేదు. ఖమ్మంలోని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నుంచి ఈ మిషన్ కొని ఉంటారని తెలిసింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో మిషన్ కొన్న తర్వాత పాత మిషన్లను అన్ని అనుమతి పత్రాలతో అమ్మడం జరుగుతుంది. కొందరు స్కానింగ్ సెంటర్ల యజమానుల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా ఈ ఆర్‌ఎంపీలు స్కానింగ్ మిషన్ కొని ఉంటారని భావిస్తున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో జ్వరం, తలనొప్పి, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు వంటి చిన్నా, చితక అనారోగ్య పరిస్థితులకు గ్రామీణ వైద్యులు అందుబాటులో ఉండి తక్కువ రేట్లకు వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు పొందేవారు. ప్రస్తుతం వారు డబ్బుల కోసం దారి తప్పడం చర్చనీయాంశంగా మారింది.

ప్రేమ పేరుతో నమ్మించి.. చివరకు వంచించి..

- యువతి జీవితంతో ఆటాడుకున్న డ్యాన్స్‌మాస్టర్
- కొన్ని రోజులుగా మరో అమ్మాయితో ప్రేమాయణం
- ఈ విషయం తెలిసి ప్రేమికుడి ఇంట్లోనే ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య
- తన చావుకు అతడే కారణమని సెల్ఫీ వీడియో
- పొన్నేకల్లులో విషాదం



శ్రీకల్యాణి(ఫైల్)

ఖమ్మంరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అతడో డ్యాన్స్ మాస్టర్.. ప్రేమ పేరుతో నమ్మించాడు.. పెళ్లి చేసుకుంటానని ప్రేమాజాలు చేశాడు. సన్నిహితంగా మెలిగాడు.. చివరకు పెళ్లి విషయం వచ్చేసరికి మాట మార్చాడు.. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన యువతి... ఆత్మహత్యకు పాల్పడింది. తానెలా మోసపోయానో చెబుతూ సెల్ఫీ వీడియోలో రికార్డు చేసింది. ఈ విషాద సంఘటన ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్లు గ్రామంలో శనివారం జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని బ్యాంకు కాలనీకి చెందిన మంగళగిరి శ్రీనివాసరావు కుమార్తె శ్రీకల్యాణి అలియాస్ కావ్య (32) నగరంలోని ఓ హోటల్‌లో ఉద్యోగం చేస్తోంది. ఖమ్మంలోని రమణగుట్ట ప్రాంతానికి చెందిన వేల్పుల అభిలాష్ అనే యువకుడు హైదరాబాద్‌లో ఓ టీవీ ఛానల్‌లో డ్యాన్స్‌షోలో డ్యాన్స్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతడు కొంతకాలంగా ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్లు గ్రామంలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఐదేళ్లక్రితం శ్రీకల్యాణికి (మిగతా 6వ పేజీలో)



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

దివ్యాంగులకు ఇక యూడీ ఐడీ కార్డులు

- సర్టిఫికెట్ విధానానికి స్వస్తి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి దివ్యాంగుడికి యూడీఐడీ నెంబర్ జనరేట్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శనివారం రాష్ట్ర సెర్ప్ సీఈవో దేవరాజ్‌దివ్య సదరం సర్టిఫికెట్ల నుంచి యూనిక్ డిజేబిలిటీ ఐడీ జారీ, సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డు జారీ ప్రక్రియ, తీసుకోవాల్సిన చర్యలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు, తదితర అంశాలపై చర్చించి అధికారులకు పలు సూచనలుచేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులతో మాట్లాడుతూ, జిల్లా ఆస్పత్రి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కార్యాలయ పరిధిలో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, మీ సేవా కేంద్రాల నిర్వాహకులకు, పంచాయతీ కార్యదర్శులకు, సీసీలకు ఎంపీడీవోలకు, ఏడీఎం, సంబంధిత అధికారులకు యూడీఐడీ. దరఖాస్తుల నమోదుపై అవగాహన, శిక్షణ అందించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి, గ్రామీణ అభివృద్ధి అధికారి సంయుక్తంగా పనిచేసి శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న (మిగతా 6వ పేజీలో)

విద్యుత్‌శాఖ ఎస్ఈగా శ్రీనివాసాచారి



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ (పర్యవేక్షక ఇంజనీర్)గా శ్రీనివాసాచారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న ఎ.సురేందర్ వరంగల్‌కు బదిలీ అయ్యారు. వరంగల్ నుంచి పదోన్నతి, బదిలీపై వచ్చిన శ్రీనివాసాచారికి సురేందర్ బాధ్యతలను అప్పగించారు. డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు. 2008లో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీఈ (ఆపరేషన్స్)గా సురేందర్ బాధ్యతలు స్వీకరించారు. తర్వాత భద్రాద్రి కొత్తగూడెం ఎస్ఈగా వెళ్లారు. తర్వాత ఖమ్మం ఎస్ఈగా వచ్చి మూడేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సురేందర్ పనిచేసిన కాలంలో విద్యుత్‌శాఖలో పరిపాలన పరమైన మంచి నిర్ణయాలతోపాటుగా విద్యుత్ వ్యవస్థ మెరుగుపడింది. మున్నేరు వరదలలో ఇళ్లు నీట మునగటంతో తిరిగి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో వారంరోజులు లోపుగానే నూరుశాతం విద్యుత్ పునరుద్ధరణ చేశారు.

సిరులు కురిపిస్తున్న ఆయిల్‌పామ్

- రూ.20,814కు చేరిన టన్ను గెలల ధర
- గత నెలలో పలికిన రేటు రూ.20,487
- ఆయిల్ రికవరీ శాతం తగ్గకుండా మంత్రి తుమ్మల చర్యలు
- ప్రైవేటు కంపెనీల ట్రిక్కులకు చెక్
- రోజురోజుకూ విస్తరిస్తున్న సాగు
- జిల్లాకో కర్మాగారం ఏర్పాటుకు సర్కారు చర్యలు



సత్తుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ రైతులకు తీపి కబురు వచ్చింది. గెలల ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుతున్నాయి. ఆయిల్‌పామ్ ఓఈఆర్ (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్) పడిపోకుండా మంత్రి తుమ్మల పటిష్ట చర్యలు తీసుకోవటంతోపాటు, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడం వంటి చర్యలతో రైతులకు మేలు జరుగుతోంది. గత నెలలో గెలల ధర టన్ను రూ.20,487 ఉండగా.. ప్రస్తుతం రూ.20,814కు పెరిగింది. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును 20 లక్షల ఎకరాలకు పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదించారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని మంత్రి తుమ్మల విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా ఆయిల్‌పామ్ సాగులో మొదటి మూడేళ్ల కాలంలో అంతర పంటల సాగుకు కూడా సబ్సిడీ అందిస్తున్నారు. మరోవైపు రైతులకు అందుబాటులో జిల్లాకు ఒక ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని నిర్మిస్తామని మంత్రి తుమ్మల ఇప్పటికే ప్రకటించారు. సిద్దిపేటలో కర్మాగార నిర్మాణం పూర్తయ్యింది. బాచుపల్లిలో నిర్మాణం సాగుతోంది. ఆయిల్‌పామ్ సాగు పెంచే క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్ని స్థాయిల్లో స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గెలల ధర రైతులకు గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆయిల్ రికవరీ శాతం మెరుగుపరిచేందుకు కృషి (మిగతా 6వ పేజీలో)

జలగండం వీడేదెన్నడో..!

- 14 నెలల్లో 12 మంది మృతి
- కనిష్ట నీటిమట్టం సమయంలోనే ప్రమాదాలు
- రక్షణ చర్యలు నామమాత్రమే..

భద్రాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానం చేసే సమయంలో లోతును అంచనా వేయలేక భక్తులు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు ఎన్నో. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రామయ్య దర్శనానికి వచ్చి స్నానాలు చేసే సమయంలో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు బాధిత కుటుంబాలకు కడుపుకోతను మిగిలిస్తున్నాయి. ఇది గత కొన్ని దశాబ్దాలుగా చోటు చేసుకుంటున్నా.. ఇటీవల కాలంలో ఈ ప్రమాదాలు ఒకింత అధికంగా జరుగుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులతో వచ్చిన సమయంలో స్నానాలకని దిగడం.. లోతును అంచనా వేయలేక మునిగి గల్లంతు కావడం భద్రాచలంలోని గోదావరిలో చోటు చేసుకుంటోంది. గత 14 నెలల్లో 12 మంది గోదావరి లోతును అంచనా వేయలేక మరలిరాని లోకాలకు తరలివెళ్లారు. అధికార యంత్రాంగం రక్షణా చర్యలు ఇక్కడ నామమాత్రంగానే ఉన్నాయని భక్తులు వాపోతున్నారు.



గోదావరిలో ప్రమాదాలు జరిగే ప్రదేశం ఇదే..

కనిష్ట నీటిమట్టానికి తగ్గిన సమయంలోనే..

గోదావరిలో ఊహించని రీతిలో జరిగే ప్రమాదాల్లో మునిగి చనిపోతున్న భక్తుల్లో అధిక శాతం మంది కనిష్టస్థాయి నీటిమట్టం ఉన్నప్పుడే తనువు చాలిస్తున్నారు. గోదావరి నిండుగా ఉన్న సమయంలో ప్రమాదాల శాతం తక్కువే అయినప్పటికీ గోదావరి ఆరు అడుగుల లోపు ఉన్నప్పుడు మాత్రమే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి కారణం ఆ సమయంలో గోదావరి చాలా చోట్ల ఇసుక తిన్నెలతో, రాళ్ల గుట్టలతో దర్శనమిస్తుండటంతో లోతు తక్కువగా ఉంటుందనే భావనతో స్నానాలు చేసే సమయంలో భక్తులు అంచనా లేక గల్లంతు అవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు తీరని ఆవేదన మిగులుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా భద్రాచలం గోదావరి స్నాన ఘట్టాల వద్ద చోటు చేసుకున్న ప్రమాదాలన్నీ ఈ తీరులోనే ఉన్నాయి. అదే కాకుండా కొంత మంది భక్తులు నిర్దేశించిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో ప్రమాదమని తెలిసినా.. ఈత వచ్చు అంటూ స్నానానికి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. 2024 అక్టోబరు 18న గోదావరిలో లోతును అంచనా వేయలేక మునిగిపోతుండగా స్థానికులు నలుగురిని కాపాడారు. అలాగే 20న ఇరువురిని, 24న ఒకరిని స్థానిక గజ ఈతగాళ్లు కాపాడారు. కాగా అక్టోబరు 31న హైదరాబాద్‌కు చెందిన ఒక భక్తుడు మృతి చెందారు. గత నవంబరు 11న ఇరువురు భక్తులను స్థానికులు కాపాడారు. ఇక్కడ గోదావరిలో మునిగిపోతున్న భక్తులను స్థానిక గజ ఈతగాళ్లతో స్థానికులు కాపాడుతున్నా కొన్ని సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రక్షణ చర్యలు నామమాత్రమే

గోదావరిలో భక్తులు స్నానాలకు వెళ్లి మృతి చెందుతున్న క్రమంలో



గోదావరి నదిలో శుక్రవారం మృతిచెందిన యువకుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

రక్షణ చర్యలను ఆ ప్రాంతంలో పటిష్టంగా చేపట్టాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. గోదావరి లోతు ఉందని లోపలికి వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని హెచ్చరికలను మైకుల ద్వారా తరచూ చేస్తూ ఉండటం ఎంతైనా అవసరం. అలాగే పోలీసు శాఖ నుంచి బాధ్యులను అక్కడ విధి నిర్వహణలో పెట్టడం ద్వారా భక్తులను లోతుకు వెళ్లకుండా వారించేందుకు వెసులుబాటు ఉంటుంది. ఎందుకంటే గజ ఈతగాళ్లు, స్థానికులు చెప్పినా వినడం లేదనే వ్యాఖ్యలు కొన్ని సమయాల్లో వినిపిస్తున్నాయి. అలాగే గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగినా.. తగ్గినా.. అందుకు అనుగుణంగా ఫెన్సింగ్‌ను ఎప్పటికప్పుడు మారుస్తూ రక్షణా చర్యలను చేపట్టాల్సిన అవసరం ఉందని భక్తులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్థానిక అధికారులు సూచించిన ప్రాంతంలోనే పుణ్య స్నానాలు చేయడం శ్రేయోదాయకమని పేర్కొంటున్నారు.

నేటి నుంచి నాల్గోతరగతి ఉద్యోగుల క్రీడలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేటి నుంచి సర్దార్ పటేల్ స్టేడియంలో మహిళా ఉద్యోగుల క్రీడలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.బిక్కు, కాంపాటి వెంకటరమణ తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో ఖమ్మం నగరంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న మహిళలు, నాల్గో తరగతి ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. మహిళలకు టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్ (తాడట),టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, లెమన్ స్పూన్ రన్నింగ్ , షాట్ పుట్, పాటల పోటీలు,కబాడి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫెర్టిలైజర్స్ డీలర్ల క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నగర మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలతో అందరితో కలిసిపోయే గుణం పెరుగుతుందని అన్నారు. నగరంలో రెండు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో ఇరు జిల్లాల నుంచి నాలుగు జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జిల్లా ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ బాధ్యులు రాంబ్రహ్మం, పృథ్వి, బి.నాగేశ్వరరావు, రామలింగ్య, పల్లఖండం నాగేందర్ ఉన్నారు.

నేలకొండపల్లి షాదీఖానాకు రూ.50లక్షలు

మంత్రి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన జామా మసీద్ కమిటీ

నేలకొండపల్లి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీహెచ్‌సీ పక్కన అసంపూర్తిగా నిలిచిపోయిన ముస్లిం షాదీఖానా నిర్మాణానికి మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో రూ.50లక్షలు మంజూరు గావటం పట్ల నేలకొండపల్లి జామా మసీద్ అధ్యక్షులు యండీ మహబూబ్‌అలీ, షేక్ సుభాన్ హర్షం వ్యక్తంచేశారు. శనివారం సాయంత్రం నేలకొండపల్లి జామా మసీద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దాదాపు పదేళ్లనుంచి అసంపూర్తిగా నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణం గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులను మంజూరు చేయించారన్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీనివాసరెడ్డికి, సహకరించిన మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డికి జామా మసీద్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో షేక్. సోందుమియా, మదార్‌సాబ్, యండీ షాకీర్, రసూల్, ఖాసీం, ఖాజా పాల్గొన్నారు.

కోటిలింగాల జాతర ఆదాయం రూ.3.54లక్షలు

కారేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహాశివరాత్రి పండుగను పురష్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన కోటిలింగాల జాతరకు రూ3లక్షల54వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. హుండీల ద్వారా రూ.92వేలు, కొబ్బరికాయల విక్రయం ద్వారా రూ.90వేలు, కొబ్బరిచిప్పల ద్వారా రూ.22వేలు, లడ్డూ ప్రసాదాలు విక్రయాల ద్వారా రూ.20వేలు, టికెట్ల విక్రయం ద్వారా రూ.1లక్షా29వేలు ఆదాయం వచ్చినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే ఆలయం అభివృద్ధి కోసం ఈ ఏడాది రూ.3లక్షల82వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సహకరించిన వారికి వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రామలింగేశ్వరస్వామి జాతర ఆదాయం రూ.9.47లక్షలు

వైరా, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఆదాయం రూ.9,47,564 వచ్చింది. మూడురోజులు జరిగిన జాతర ఆదాయాన్ని శనివారం లెక్కించారు. టిక్కెట్లపై రూ.2,99,840, హుండీ ఆదాయం రూ.3,55,450, లడ్డూపై రూ.1,39,500, కొబ్బరిచిప్పల ఆదాయం రూ.19వేలు, షాపుల అద్దెలు రూ.83,350, మిఠాయి దుకాణాల ద్వారా రూ.50వేలు, కల్యాణకట్నాలు రూ.424 లభించాయి. ఆలయ ఈవో హరిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు కె.వేణుగోపాలాచార్యులు, ఎస్.శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు, దొడ్డా ఉషారాణి, మల్లు శేషమ్మ, మొగునూరి సత్యనారాయణ, సుల్తాన్ పద్మ, తలారి నర్సింహారావు, సంగెపు రామకృష్ణ, గిరిగాని శ్రీనివాసరావు, మైబు జానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామి ఆలయ ఆదాయం రూ.3.80 లక్షలు

మధిరటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మధిరలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీమృత్యుంజయ స్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.3,80,427 వచ్చింది. ఆలయ ఈవో జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం దేవాదాయ శాఖ సిబ్బంది సమక్షంలో లెక్కింపు చేపట్టగా హుండీ ద్వారా రూ 3,80,427ల ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ, సిబ్బంది రాధ, సత్యసాయి సేవా సమితి వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రి ఆదాయం రూ.10.47లక్షలు

పెనుబల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా నీలాద్రీశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.10,47,856 వచ్చినట్లు ఆలయ ఈవో పాకాల వెంకటరమణ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులతోపాటు చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

కానిస్టేబుల్‌కు సీపీ అభినందన

ఖమ్మంక్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): టాటా అల్ట్రా మారథాన్ 50కిమీ. రన్‌లో మెడల్ సాధించిన కానిస్టేబుల్ పిల్లి రాజును పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు. గతనెల 23న పూణే సమీపంలోని లోనవాలా సయ్యాద్రి కొండలలో 800 మీటర్ల ఎత్తులో టాటా అల్ట్రా మారథాన్‌రన్ 50కి.మీ.లను 6గంటల 39 నిమిషాలలో రాజు పూర్తిచేసి మెడల్ సాధించాడు. సముద్ర మట్టానికి 2400 అడుగుల ఎత్తులో అర్ధరాత్రి 1గంటల సమయంలో పరుగు మొదలు పెట్టిన రాజు రాత్రి సమయంలో తలకు టార్చిలైటు పెట్టుకుని కొండల మధ్యలో అటవీప్రాంతంలో పరుగు తీసినట్టు రాజు తెలిపారు. అదేవిధంగా విజయవాడ నందు కృష్ణారివర్ క్రాస్ ఈత పోటీలో 26నిమిషాల 8 సెకండ్లలో 1.5కి.మీ. ఈది పతకం సాధించినట్టు రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు కుమారస్వామి, ఏసీపీ సుశీల్‌సింగ్, నరసయ్య, ఆర్ఐ అప్పలనాయుడు, పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో మరమ్మతులను పరిశీలించిన జీఎం

దమ్మపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో జరుగుతున్న మరమ్మతుల పనులను ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా అప్పారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలుపుదల చేసి మరమ్మతుల పనులు నిర్వహిస్తున్నారు. త్వరితగతిన మరమ్మతుల పనులను పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించాలని మేనేజర్ కళ్యాణ్‌ను ఆదేశించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.



పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఉగాది నాటికి 'మంచుకొండ ఎత్తిపోతల'

(5వ పేజీ తరువాయి)

కొంతదూరం నడిచి వెళ్లారు. పనులు జరుగుతున్న తీరును సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అక్కడక్కడ రైతులు వ్యవసాయ పంటలు ఇంకా పూర్తిస్థాయిలో ఇళ్లకు చేరలేదని, అటువంటి పంటలున్న భూముల్లో 15 నుంచి 20 రోజులు సమయం ఇవ్వాలని సూచించారు.

ఈ సందర్భంగా మల్లేపల్లి చెరువు కట్టపైనే మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రాధాన్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పిన వెంటనే రూ.66 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఒకే సాగునీటి పథకం ద్వారా 36 చెరువులకు సాగునీరు అందుతుందని ఇప్పటికే ఖమ్మం వంటి నగరాలకు రఘునాథపాలెం మండలం నుంచే కూరగాయలు, ఉద్యాన పంటలు అందుతున్నాయని, సాగు నీటి లభ్యత పెరిగిన తర్వాత ఆయిల్‌పామ్‌పై రైతులు దృష్టి పెట్టాలని మంత్రి కోరారు. అధికారులు పట్టుదలతో పని చేసి ఖచ్చితంగా ఉగాది నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి జరిగేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

మేయర్ పునుకొల్లు నీరజ, ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, ఆత్మచైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వాంకుడోత్ దీప్లానాయక్, బాలాజీనాయక్, తాతా రఘురాం, కుంటుముక్కుల నాగేశ్వరరావు, దేవ్‌సింగ్‌నాయక్, బండి నాగేశ్వరరావు, రామునాయక్, బండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నెలవంక దర్శనం

(5వ పేజీ తరువాయి)

దోహదపడతాయని, మానవ సేవ చేయాలనే సందేశాన్ని అందిస్తుందని పలువురు ముస్లిం మత పెద్దలు తెలిపారు. ప్రభుత్వం రంజాన్ మాసంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం గంట ముందుగానే ఇళ్లకు వెళ్లేందుకు అనుమతినిచ్చింది. మసీదుల వద్ద పారుశుధ్య కార్యక్రమాలను చేపట్టి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ నెలలో ముస్లింలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం సైరన్ మోగేంత వరకు ఆహార పానీయాలు ముట్టుకోకుండా నెల రోజులపాటు ఆచరిస్తారు. ఈ నెలలో ఎక్కువగా ఖురాన్ పఠనం చేస్తుంటారు. ఇఫ్తార్ విందులు సందడి చేయనున్నాయి.

న్యాయవాదుల చర్చాగోష్ఠి.. ఉద్యమ కమిటీ ఏర్పాటు

ఖమ్మంలీగల్,మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఓ హోటల్లో శనివారం న్యాయవాదుల చర్చాగోష్ఠి నిర్వహించారు. సహస్ వెల్ఫేర్ లీగల్ కమిటీ నిర్వాహకుడు తాళ్లూరి దిలీప్‌చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు చొరవ తీసుకొని వెంటనే 35 బీఎన్‌ఎస్‌ఎస్(41ఏ సీఆర్‌పీసీ)సెక్షన్‌ను చట్టసమరణ చేయాలని కోరారు. ఈ సెక్షన్ చట్టసవరణ చేయటంవల్ల నేరాలను అదుపు చేయవచ్చని, బాధితులకు న్యాయం జరుగుతుందని, ఈ సెక్షన్‌ను సవరణ చేయకపోవటం వలన తెలంగాణాలో నేరాలు ఎక్కువ అయ్యాయని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. అనంతరం న్యాయవాద జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమల్‌రావు మాట్లాడుతూ మహిళా వ్యతిరేకత నేరాలపై, ప్రజలపై దాడి, కమ్యూనల్ నేరాలపై అరెస్టుచేసి రిమాండ్ చేయాలని నాలుగు ప్రధాన డిమాండ్లను సభముందు ఉంచారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు మాట్లాడుతూ 35 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ను సర్క్యులర్ ద్వారా సమరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

అనంతరం (41ఏ సీఆర్‌పీసీ) 35 బీఎన్‌ఎస్‌ఎస్ ఉద్యమ కమిటీని ఏర్పాటుచేసుకున్నారు. ఈ కమిటీకి రాష్ట్ర కన్వీనర్‌గా తాళ్లూరి దిలీప్‌చౌదరి, గౌరవ సలహాదారులుగా బిచ్చాల తిరుమలరావు, దిశాల కృష్ణారావు, కమిటీ సభ్యులుగా పసుపులేటి శ్రీనివాసరావు, రావుల వెంకట్, మాల్యాద్రి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బార్‌అసోసియేషన్ అధ్యక్షులు సభ్యులుగా కొనసాగుతారని ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణ తీర్మానం చేశారు.

ఆర్‌ఎంపీల ముసుగులో అరాచకం

(5వ పేజీ తరువాయి)

ఏ స్కానింగ్ సెంటర్‌లో పెడుతున్నామో.. దానికి సంబంధించి ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ల వివరాలు, ఆస్పత్రులతోపాటు స్కానింగ్ సెంటర్ల గుర్తింపు వివరాలు అందుకు సంబంధించిన రేడియాలజిస్టు వివరాలను అల్ట్రా స్కానింగ్ కంపెనీకి తెలపాలి. అప్పుడు మాత్రమే స్కానింగ్ మిషన్‌ను కంపెనీలు విక్రయిస్తాయి.

అయితే ఇలా ఏమీ లేకుండా ముగ్గురు ఆర్‌ఎంపీలు కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గర్భిణుల వద్దకు వెళ్లి లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అమ్మాయో, అబ్బాయో అన్న విషయం తెలిపి అంతకుముందు ఒక వేళ అమ్మాయి అయి ఉంటే అబార్షన్ చేయడం ఈముఠా నిర్వహిస్తుంది. కారులోనే వెనుక సీటు భాగం తొలగించి అల్ట్రాస్కానింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. చింతకాని మండలం కొదుమూరుకు చెందిన ఆర్‌ఎంపీ రాచబంటి మనోజ్, ఖమ్మం అల్లీపురానికి చెందిన కాత్యాయని, ఖమ్మం బల్లేపల్లికి చెందిన చారితోపాటు మరి కొందరు ఈ ముఠాలో సభ్యులుగా ఏర్పడి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాచబంటి మనోజ్ ప్రస్తుతం డోర్నకల్ మండలం అమ్మపాలెంలో ఆర్‌ఎంపీగా వైద్యం అందిస్తున్నాడు.

మామూలుగా అయితే రూ.వెయ్యి ఉండే ఈ పరీక్షకు రూ.10వేలనుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. ఆడపిల్ల వద్దనుకుంటే అబార్షన్ చేసినందుకు అదనంగా సొమ్ములు పిండుతున్నారు. శుక్రవారం వీరు పరీక్షలు నిర్వహిస్తుండగా.. పోలీసులు దాడిచేసి పట్టుకున్న విషయం విదితమే. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాననిందితుడు చారి కోసం గాలిస్తుండగా మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై వదిలేశారు.

ప్రేమ పేరుతో నమ్మించి చివరకు వంచించి..

(5వ పేజీ తరువాయి)

డ్యాన్స్‌మాస్టర్ అభిలాష్‌తో ఖమ్మంలో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరూ సన్నిహితంగా మెలుగుతూ వచ్చారు. అయితే కొన్ని నెలలుగా కల్యాణిని డ్యాన్స్‌మాస్టర్ అభిలాష్ పట్టించుకోవడం లేదు. శనివారం ఉదయం కల్యాణికి ఫోన్ చేసి మాట్లాడే పని ఉందని, పొన్నెకల్లు రావాలని పిలిచాడు. దాంతో ఆమె పొన్నెకల్లులోని అభిలాష్ ఉంటున్న ఇంటికి వెళ్లింది. అక్కడ వారిమధ్య పెళ్లి ప్రస్తావన రాగా, ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే వున్న గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. సెల్ఫీ వీడియో రికార్డు చేసి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది.

అభిలాష్ తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తన చావుకు అభినే కారణమని వీడియోలో పేర్కొంది. అభిలాష్ కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా, కల్యాణి అపస్మారక స్థితిలో వేలాడుతూ కనిపించింది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కల్యాణి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా చావుకు అభినే కారణం

ఆత్మహత్యకు ముందు శ్రీకల్యాణి సెల్ఫీవీడియో రికార్డు చేసింది. 'నా చావుకు అభినే కారణం.. ఐదు సంవత్సరాలుగా నన్ను ప్రేమిస్తున్నానని చెప్పి తన ఇంటికి తీసుకువచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఇప్పుడు నన్ను వదిలేసి ఇంకో అమ్మాయిని తీసుకువచ్చి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చెపుతున్నాడు. నన్ను ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని చెబుతున్నాడు. నన్ను మోసం చేశాడు. అందుకే ఉరివేసుకుని చనిపోతున్నాను. సారీ అమ్మా' అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి తన మొబైల్ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకుని ఉరివేసుకుంది.

ఇద్దరు అమ్మాయిలతో ప్రేమాయణం

శ్రీకల్యాణితో ప్రేమాయణం నెరిపిన డ్యాన్స్‌మాస్టర్ అభిలాష్ ఆ తర్వాత మరో అమ్మాయితో ఎఫైర్ పెట్టుకున్నాడు. ఇది శ్రీకల్యాణికి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. కొన్నేళ్లుగా ప్రేమ నటిస్తూ నిన్నే పెళ్లి చేసుకుంటానని శ్రీకల్యాణిని నమ్మించాడు. దీంతో ఆయనతోనే జీవితం ఉంటుందని ఆమె ఆశపడింది. అయితే మరో అమ్మాయితో రిలేషన్‌లో వున్న అభిలాష్.. కొన్ని రోజుల నుంచి శ్రీకల్యాణిని దూరం పెడుతూ వస్తున్నాడు. ఆ అమ్మాయితో పెళ్లికి సిద్ధమవుతున్న విషయం శనివారం స్పష్టం కావడంతో శ్రీకల్యాణి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది.

దివ్యాంగులకు ఇక యూడీ ఐడీ కార్డులు

(5వ పేజీ తరువాయి)

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులుగా యూనిక్ డిజేబిలిటీ ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు, ఇవి ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడతాయని, వీటిపై అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా సంక్షేమ అధికారికి తెలిపారు. సదరం సర్టిఫికెట్ నుంచి యూడీ ఐడీ కార్డ్ జనరేట్ చేసిన తర్వాత కార్డు చేరని దివ్యాంగులు ఎవరైనా ఉంటే సదరు వివరాలు సేకరించి రిపోర్ట్ చేయాలన్నారు. ఈ కార్డు పై వైద్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి 28వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లతో చేయూత పెన్షన్, ఇతర సదుపాయాలను దివ్యాంగులు పొందవచ్చని, ఇతర రాష్ట్రాల్లో ఏదైనా సౌకర్యం పొందాలంటే దివ్యాంగులకు యూడీఐడీ కార్డు తప్పనిసరన్నారు.

మార్చి ఒకటి నుంచి దివ్యాంగులకు యూడీఐడీ కార్డులను జారీ చేయనున్నట్లు వీటి ద్వారానే పెన్షన్ ఇతర సౌకర్యాలు పొందాల్సి ఉంటుందన్నారు. నూతనంగా యూడీఐడీ. కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆస్పత్రిలో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత కార్డు జనరేట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న ఆయిల్‌పామ్

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఓఈఎఫ్ పడిపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

గతంలో ఆయిల్ రికవరీ శాతం తగ్గించేందుకు కొన్ని ప్రైవేటు కంపెనీలు భారీగా పైరవీలు సాగించడంతో రికవరీ శాతం తగ్గి రైతులకు సరైన ధర లభించేది కాదు. కానీ తుమ్మల వ్యవసాయశాఖ మంత్రి అయిన నాటి నుంచి ఓఈఎఫ్‌పై దృష్టి సారించారు. ప్రైవేటు కంపెనీల పెత్తనం ఆయిల్‌ఫెడ్‌పై పడకుండా చర్యలు తీసుకున్నారు. తుమ్మల వ్యవసాయశాఖ మంత్రి అయిన సమయంలో టన్ను గెలల ధర రూ.12,300 ఉండగా అది క్రమంగా పెరుగుతూ వస్తోంది. దీనికి తోడు ఆయిల్‌పామ్ రైతులకుకనీస మద్దతు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. దాంతో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది



నూనెల దిగుమతిపై దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచటంతో ఆయిల్‌పామ్ గెలల ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో గత ఏడాది నవంబరులో టన్ను గెలల ధర రూ.20,043కు చేరింది. గత నెలలో రూ.20,487 ఉన్న ధర.. తాజాగా రూ.20,871కు చేరింది. రికవరీ శాతం ప్రస్తుతం 19.40 శాతంగా ఉంది. పెరిగిన ధరలతో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఏడు వేల మంది రైతులకు మేలు జరగనుంది.

అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి

ఓఈఎఫ్‌ను ప్రభావితం చేసేందుకు కొన్ని ప్రైవేటు కంపెనీలు కొందరిని పావులుగా వాడుకుంటున్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో మంత్రి తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్‌పామ్ రైతులకు నష్టం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆయిల్ రికవరీ శాతం తగ్గించే ప్రయత్నాలతో పాటు నర్సరీల్లో ఆఫ్‌టైప్ మొక్కలు సరఫరా జరుగుతున్నాయని ప్రచారం చేసి లబ్ధి పొందాలనుకునే వారిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తద్వారా ఆయిల్‌పామ్ సాగుపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



శ్రీవారిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల.కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు.

అలసత్వం.. అనాసక్తి..

- ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో ఆసక్తి చూపని టీచర్లు..
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు టీచర్ల నమోదు
- 27న జరిగిన పోలింగ్‌లో అనర్హులకు ఓట్లు..



ఓటరు జాబితాలో టీచర్ల పేర్లను పరిశీలిస్తున్న సంఘాల నాయకులు(ఫైల్)

ఇల్లెందు/ కొత్తగూడెం అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల అర్హతలు, నమోదు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ, లోక్‌సభ, స్థానిక సంస్థలు తదితర సాధారణ ఎన్నికలకు సంబంధించి ఒక పర్యాయం ఓటరుగా నమోదు చేసుకుంటే దశాబ్దాలు దాటినా, ఓటరు మరణం వరకు జాబితాలో కొనసాగుతుంది. నూతన ఓటరు నమోదు కోసం 18 ఏళ్లనిండిన వారు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. శాసనమండలి ఎన్నికల్లో స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో, శాసనసభ్యుల కోటా ఎన్నికల్లో ఓటర్ల నమోదు భిన్నంగా ఉండటం గమనార్హం.

నమోదులో నిరాసక్తత..

స్థానిక సంస్థలకు, శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఓటర్ల వివరాలు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎమ్మెల్యేల పేర్లను ఎన్నికల కమిషన్ యంత్రాంగం నుంచి నేరుగా సేకరించి ఓటర్లుగా పరిగణిస్తారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్లు ఎన్నికలు జరిగిన ప్రతి సందర్భంలో ఓటర్లుగా అర్హులైన వారంతా స్వచ్ఛందంగా రెవెన్యూ కార్యాలయాలు, ఆన్‌లైన్‌ల ద్వారా టీచర్లు, గ్రాడ్యుయేట్లు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. దీనికి అధిక సమయం వెచ్చించడం ఇష్టం లేని పట్టభద్రులు, టీచర్లు వేలాది మంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదుపై ఆసక్తి చూపడం లేదు. ఈసమస్యలే ఎమ్మెల్సీ టీచర్ల నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణంగా కనిపిస్తోంది.

అనర్హులకు ఓట్లు..

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడిజిల్లాల శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఈనెల 27న జరిగిన ఎన్నికల్లో వందలాదిమంది అనర్హులకు ఓటుహక్కు కల్పించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి ప్రైవేట్ టీచర్లకు ఓట్లు కల్పించడం వివాదంగా మారుతోంది. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావాలంటే 2018 నుంచి 2023 వరకు ఉపాధ్యాయ సర్వీస్ కలిగి ఉండాలి. ప్రైవేట్ పాఠశాలల్లో కేవలం ఎయిడెడ్, ప్రావిడెంట్ ఫండ్ గుర్తింపుపొందిన విద్యాసంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కు పొందేందుకు అర్హులు. అయితే గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రభుత్వ ఎయిడెడ్ లేని, సర్వీసు ధ్రువీకరించని అనేక మంది ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ కాలేజీల్లో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లకు ఓటు హక్కు కలిగిఉండటం చర్చనీయాంశమైంది.

- వాహనంలో లింగనిర్ధారణకు స్కానింగ్ యంత్రం ఏర్పాటు
- గర్భ విచ్ఛిత్తి కోసమే రహస్యంగా పరీక్షలు
- పేరు తెలియకుండా జాగ్రత్త పడిన ప్రధాన నిందితుడు
- బయటికి రాని సూత్రధారిగా వ్యవహరించిన వైద్యుడి వివరాలు





పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, స్కానర్

'హైటెక్' కారులో లోటెక్ వ్యవహారం

చింతకాని, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనకు అలవాటు పడి లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా కడుపులోనే శిశువులను చిదిమేస్తున్న ముఠా గుట్టును ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. దీనికి సంబంధించి టాస్క్‌ఫోర్స్ వలకు చిక్కిన ఇద్దరు నిందితులు ఖమ్మం నగరం పంపింగ్‌వెల్ రోడ్‌కు చెందిన అల్లీపురం కాత్యాయని, చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన రాచబంటి మనోజ్ ఇచ్చిన సమాచారం మేరకు బల్లేపల్లికు చెందిన గ్రామీణ వైద్యుడు చారీని ప్రధాన నిందితుడుగా చేర్చుతూ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న చారితన పూర్తి పేరు, ఇంటి చిరునామాను ముఠాలోని ఇతర సభ్యులకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. పోలీసులు పట్టుకున్న ఇద్దరిలో రాచబంటి మనోజ్ డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామంలో ఆర్ఎంపీగా, లింగ నిర్ధారణకు వినియోగిస్తున్న మొబైల్ అల్ట్రా స్కానింగ్ కారుకు డ్రైవరుగాను పనిచేస్తుండగా, కాత్యాయని అల్ట్రా స్కానింగ్ మెషిన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కారులో ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తిరుగుతూ గత కొంత కాలంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ గర్భ విచ్ఛిత్తిలకు పాల్పడతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్న వైద్యుడెవరు?

లింగా నిర్ధారణ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. గత రెండు రోజులగా జిల్లా అంతటా చర్చనీయాంశమైన ఈ కేసులో ప్రధాన నిందితుడు చారి పరారీలో ఉన్నాడు. అతణ్ని పట్టుకునేందుకు పోలీసు బృందాలు ప్రయత్నిస్తున్నాయి. లింగ నిర్ధారణ అనంతరం గర్భ విచ్ఛిత్తి కొరకు ఇల్లెందు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి వద్దకు పంపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇల్లెందు, ఖమ్మం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ఎవరైనా నిందితులకు సహకరిస్తున్నారా అనేది చారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

కారులో మినీ ల్యాబ్ ఏర్పాటు

లింగ నిర్ధారణ పరీక్షల కొరకు కారును కొనుగోలు చేసిన నిందితులు కారులో ఓ మొబైల్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. మినీ స్కానింగ్ మెషిన్‌కు కంప్యూటర్‌ను అనుసంధానం చేశారు. స్కాన్ పూర్తి కాగానే కంప్యూటర్ మానిటర్‌లో వచ్చే చిత్రాలను చూపించి లింగ నిర్ధారణ (ఆడ, మగ) తెలియజేస్తారు. లింగ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తిని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి వారి నుంచి ప్రధాన నిందితుడు చారి డబ్బులు వసూలు చేసేవాడు. లింగ నిర్ధారణకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, గర్భ విచ్ఛిత్తికి రూ.50 వేల దాకా వసూలు చేస్తున్నారు. ఆర్ఎంపీలుగా పనిచేస్తున్న వీరు జిల్లాతో పాటు మహబూబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామాల్లో వీరికి ఉన్న పరిచయాలతో ఈ దందా గత కొంత కాలంగా కొనసాగిస్తోంది. నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరిపై నిఘా ఉంచి పట్టుకున్నారు.

అనుచరుడి పాడె మోసిన మంత్రి తుమ్మల

- గాదె సత్యనారాయణకు పలువురి నివాళి



గాదె సత్యనారాయణ అంతిమయాత్రలో పాడెమోస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రాజకీయ నాయకుడు, సత్తుపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు గాదె సత్యనారాయణ అంతిమయాత్రలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. గాదె సత్యనారాయణ మృతదేహానికి హైదరాబాద్ నుంచి వచ్చిన మంత్రి తుమ్మల శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని ఆయన పాడెను మోశారు. ఈ సందర్భంగా గాదె సత్యనారాయణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

పలువురి నివాళి

సత్యనారాయణ మరణ వార్త తెలుసుకున్న పలువురు శనివారం ఆయన ఇంటికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, కమ్మ సంఘం అధ్యక్షుడు చలసాని సాంబశివరావు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ నాయకులు దొడ్డా శంకరరావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

గురు శిష్యులు కలిశారు..

- గాదె సత్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల, మెచ్చా
- తమ అనుబంధం, రాజకీయ పరిస్థితుల గురించి చర్చ



సత్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొన్న తుమ్మల, మెచ్చా

దమ్మపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం సత్తుపల్లిలో మృతి చెందిన గాదె సత్యనారాయణ అంత్యక్రియల్లో కలుసుకొన్నారు. నాలుగు దశాబ్దాలపాటు తుమ్మల వెన్నంటి ఉన్న మెచ్చా నాగేశ్వరరావు రాజకీయాల కారణంగా రెండు సంవత్సరాలుగా దూరమయ్యారు. రాజకీయ అనుబంధంతోనే గురుశిష్యులు తుమ్మల, మెచ్చా సత్తుపల్లిలో కలిశారు. గాదే సత్యం అంత్యక్రియల అనంతరం కొద్దిసేపు తుమ్మల మెచ్చా నాగేశ్వరరావు రాజకీయంగా గాదె సత్యనారాయణతో ఉన్న ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

తుమ్మల, మెచ్చా ఒకే పార్టీలో ఉన్నప్పటికి గత శాసనసభ ఎన్నికల్లో మారిన రాజకీయ సమీకరణల్లో తుమ్మల కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం శాసనసభ్యుడిగా పోటీ చేసి గెలుపొంది ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మెచ్చా మాత్రం బీఆర్ఎస్ పార్టీ తరుపున అశ్వారావుపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాటి నుంచి నేటి వరకు గురుశిష్యులు కలుసుకోలేదు. సత్తుపల్లిలో గాదె సత్యనారాయణ మృతి చెందగా అయన అంత్యక్రియల్లో తుమ్మల, మెచ్చా కలిసి పాల్గొనటంతో పాటు గతంలో వారితో ఉన్న బంధాన్ని గుర్తు చేసుకొంటూ కన్నీరు పెట్టుకున్నారు. కొద్దిసేపు ఇరువురు వ్యవసాయంపై చర్చించినట్లు సమాచారం. పామాయిల్, కొబ్బరి సాగు ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, పామాయిల్ ధరలపై చర్చించినట్లు సమాచారం. ఎట్టకేలకు గురుశిష్యులు కలిసి నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధం, ఒకే మండల వాసుల స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి ఇరవై ఏళ్ల యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై యువతి సోదరుడు తరుణ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వివరించారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న బాలుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటకు బాలుడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను కొద్దిరోజులుగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. బాలికను పలు రకాలుగా వేధిస్తుండటంతో విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వివరించారు.

మంగయ్య బంజర్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



మనోహర్(ఫైల్)

చంద్రుగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం మంగయ్య బంజర్ గ్రామంలో నక్కా మనోహర్ (22) మృతి చెందాడు. ఈ ఘటపై స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మనోహర్ శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంటి ముందు వసారాలో పడుకున్నాడు. శనివారం ఉదయం ఇంటి వెనుక జామచెట్టుకు మనోహర్ తాడుతో వేలాడుతూ భూమిపై కూర్చునట్లు పక్క ఇంటిలో నివాసం ఉంటున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు.

కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి మనోహర్ చెందినట్లు నిర్ధారించారు. దీంతో మనోహర్ తండ్రి రాంబాబు చంద్రుగొండ చేరుకొని తన కుమారుడు మృతిపై అనుమానం ఉందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా ఎస్ఐ శివ రామకృష్ణ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బియ్యం రవాణాపై టాస్క్‌ఫోర్స్ నజర్

- చెక్‌పోస్టు వద్ద 12 లారీల నిలిపివేత
- కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం తనిఖీలు



అశ్వారావుపేట చెక్ పోస్టువద్ద బియ్యం లారీలను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

అశ్వారావుపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైస్‌మిల్లర్లకు మిల్లింగ్ నిమిత్తం ఇచ్చిన సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం తరలింపు వ్యవహారంపై సీరియస్‌గా ఉంది. అందులో భాగంగా శుక్రవారం రాత్రి సివిల్ సప్లయాస్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి 12 బియ్యంలారీలను నిలిపివేశారు. ప్రభుత్వం రైతులనుంచి సేకరించిన ధాన్యం సీఎంఆర్ పద్ధతిలో మిల్లింగ్ కోసం రైస్‌మిల్లుకు అందజేసింది. ఈ పద్ధతిలో మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా మిల్లర్లు బయట మార్కెట్‌లో విక్రయించకుండా తనిఖీలు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ తెలిపారు.

శుక్రవారం రాత్రి అధికారులు నిలపివేసిన 12 లారీలు నల్గొండ, ఖమ్మం, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళుతున్నట్లు డ్రైవర్ల ద్వార తెలిసినట్టు ఆయన తెలిపారు. ఈ లారీల సమాచారాన్ని ఆయా జిల్లాల సివిల్ సప్లయాస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత అధికారులు ఆయా జిల్లాల్లోని రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించిన అనంతరం 10 లారీల్లో బియ్యం పూర్తి అనుమతులతో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చి వాటిని వదిలేశారు. నల్గొండ జిల్లాకు చెందిన మరో రెండు లారీల వివరాల కోసం వేచిచూస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం మిల్లర్లకు ఇచ్చిన బియ్యాన్ని తప్పనిసరిగా తిరిగి ఇవ్వాలని, అలా కాకుండా బయట మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీ బృందంలో సీఐ వసంతరావు, ఎస్ఐ కృష్ణ, జంగయ్య, భాస్కర్ సిబ్బంది ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

ద్విచక్రవాహనం, రూ.1800 నగదు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసి, అతడి వద్దనుంచి రూ.8500 విలువైన కిరాణా సామాను, రూ.1800 నగదు, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మానికి చెందిన జిల్లా తిరుమలాయపాలెం మండలం మహమ్మదాపురం గ్రామశివారు ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ సురేష్ కొంతకాలం నుంచి మహబూబాబాద్, మరిపెడ, తిరుమలాయపాలెంలో ఫర్టిలైజర్ షాపులు, కిరాణాషాపులను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుండేవారు. గత కొద్దిరోజులుగా మద్యానికి బానిసైన సురేష్ కు తల్లిదండ్రులు, భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో తాళాలు వేసిన షాపులను, ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేస్తున్నాడు. గత ఏడాది మహబూబాబాద్ పట్టణంలోని కాసం ఫ్యాషన్స్ మాల్‌లో, వివేకానంద సెంటర్‌లోని వాసవి కిరాణాషాప్, నెహ్రూసెంటర్‌లోని బాలా జీ కిరాణాషాప్, మరిపెడ బంగ్లాలోని నాగార్జున్ ఫర్టిలైజర్ షాప్, ధనలక్ష్మి ఐరన్‌షాప్, తిరుమలాయపాలెంలోని ఓ ఇంటిలో దొంగతనం చేశారు.

ఇటీవల స్కూటీని ఎత్తుకెళ్లి, దానిమీద తిరుగుతూ.. దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల మహబూబాబాద్‌లోని నెహ్రూసెంటర్‌లో బాలాజీ కిరాణషాపులోని డ్రైఫ్రూట్స్ కిరాణా వస్తువులను దొంగిలించి, వాటిని మహబూబాబాద్‌లో విక్రయించేందుకు వస్తుండగా కురవి గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న టౌన్, సీసీఎస్ పోలీసులు అతన్ని పట్టుకుని విచారించారు. దీంతో తాను చేసిన నేరాలను అంగీకరించినట్లు చెప్పారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

తిరుమలాయపాలెం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. ముజాహిద్‌పురానికి చెందిన నల్లగట్టు ఉపేందర్, లావణ్యలకు ముగ్గురు పిల్లలున్నారు. వారిలో పెద్దకుమారుడైన రోహిత్(6) శనివారం ఇంటి ముందు ఆగి ఉన్న ట్రాక్టర్‌మీద కూర్చుని ఇంజన్‌కున్న తాళం తాప్పాడు. ట్రాక్టర్ స్టార్ట్ అయి ముందుకు కదలడంతో రోహిత్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ వెనుకచక్రాల కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషన్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రోహిత్ మృతిని తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

చింతకాని, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక తుపాకుల అగ్గి రాముడు (43) అనే వ్యక్తి ఉరి వేసుకుని మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడికి కుటుంబ అవసరాల, పిల్లల చదువులు నేపథ్యంలో అప్పులు అయ్యాయి. అప్పుల భారంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించిన రాముడు తెల్లవారుజామున ఇంటి బయట రేకులకు ఉన్న ఇనుప కడ్డీలకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు. మృతుని భార్య ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంట చేనులో క్షుద్ర పూజల కలకలం

కొణిజర్ల, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలచలక గ్రామ మాజీ సర్పంచ్ బాదావత్ సైదులు మొక్కజొన్న చేలో పసుపు, కుంకుమ, ముగ్గు, నిమ్మకాయలు, చనిపోయిన కోడి ఉండటంతో క్షుద్రపూజలు చేశారని ప్రచారం జరుగుతోంది. చేను రైతు, మాజీ సర్పంచ్ సైదులు పోలీసులకు కొంతమంది తనపై క్షుద్రపూజలు చేసి ఉంటారని అనుమానంతో శనివారం ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మిర్చి కూలీల ఆటో బోల్తా...

- తొమ్మిది మంది మహిళలకు గాయాలు



ప్రభుత్వ వైద్యశాలలో గాయపడిన కూలీలు

ఇల్లెందురూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): మిర్చి కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడగా తొమ్మిది మంది కూలీలకు గాయలైన సంఘటన ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. సుదిమళ్ల గ్రామానికి చెందిన మిర్చి కూలీలు ట్రాలీ ఆటోలో ధర్మాపురం-పూబెల్లి గ్రామాల్లో రైతుల చేన్లలో కూలీ పనులకు వెళుతున్నారు. మార్గమధ్యలో పూబెల్లి గ్రామ సమీపంలో ట్రాలీ ఆటోకు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పిన ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఆ టోలో ప్రయాణిస్తున్న మిర్చి కూలీలు కె. సంధ్య, గురవమ్మకు తీవ్రగాయాలు కాగా, నాగమణి, వీరమ్మ, నర్సమ్మ, రాజేశ్వరీ, లావణ్య, కనకమ్మ, లక్ష్మి అనే ఏడుగురు కూలీలు స్వల్ప గాయాలపాలయ్యారు. గాయపడిన కూలీలను గ్రామస్థులు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

జూలూరుపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుమిట్టతండ గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మాచినేనిపేటపంచాయతీ పరిధిలోని గోపాతండా గ్రామానికి చెందిన దారావత్ హత్తీరాం అనే యువకుడు ద్విచక్రవాహనంపై జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దండుమిట్టతండ గ్రామసమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనల అతనికి గాయాలయ్యాయి. వైద్య చికిత్సలు అందించేందుకు అతన్ని జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

ఇదేం పాడు పని..

- అర్ధరాత్రి ఆలయం ముందు అశ్లీల నృత్యాలు



వేదికపై డాన్సు చేస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ధంసలాపురం వద్ద ఉన్న ఓ ఆలయంలో మూడురోజులనుంచి శివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈనేపథ్యంలో భారీ శబ్దాలు, డీజేలతో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అమ్మాయిలతో అశ్లీల నృత్యాల ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. స్థానికులు ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ భాను ప్రకాష్ సిబ్బంది అక్కడకు చేరుకుని డ్యాన్సులు చూడడానికి వచ్చిన భారీ జనాన్ని పంపించారు. అనంతరం ఈవెంట్ చేస్తున్న అమ్మాయిలను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. తక్షణమే ఇక్కడనుంచి వెళ్లాలని హెచ్చరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈఘటనపై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా అర్ధరాత్రి అమ్మాయిలతో డ్యాన్సు ప్రోగ్రాం నిర్వహించిన మాట వాస్తవమేనని, సిబ్బందితో వెళ్లి నిలిపివేసినట్టు తెలిపారు.



కోదండరామ్‌ను కలిసిన టీజేఎస్ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ జనసమితి కమిటీ నాయకులు శనివారం హైదరాబాదులో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ పార్టీని జిల్లాలో విస్తరించే విధంగా కృషిచేయాలని కోరారు. కోదండరామ్‌ను కలిసిన వారిలో టీజేఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, ఖమ్మంజిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సర్దార్, బట్టు రాజేందర్‌నాయక్, ఖమ్మం నగర అధ్యక్షుడు బెల్లంకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

▸ డీఈవో సోమశేఖరశర్మ

నేలకొండపల్లి, మార్చి1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ, పీఎమ్మార్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్, కెరీర్ గైడెన్స్ అవగాహనా సదస్సును నేలకొండపల్లిలో డీఈఓ ప్రారంభించారు. మండల విద్యాధికారి చలపతిరావు అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో డీఈఓ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి క్రమశిక్షణ, పట్టుదల అందుకు తగిన ప్రణాళిక ఎంతో అవసరమన్నారు.జీవితంలో ఏదైనా విజయం సాధిస్తే ఎన్నో ప్రశంసలు, అభినందనలు వస్తాయని, అదే విజయం మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందన్నారు. నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగితే విజయం మోకరిల్లుతుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ప్రతి వ్యక్తిని జీవితంలో ముందుకు తీసుకెళుతుందని ఎస్ఐ సంతోష్ అన్నారు.కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ఛైర్మన్ రవీందర్, సభ్యులు శ్రీధర్, నాగరత్నం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్, పురుషోత్తం, రాగలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో

సమన్వయంతో పని చేయాలి

▸ పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

▸ అధికారులతో అదనపు కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి1(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, మార్చి నెలాఖరులోగా స్ర్కూటినీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్లు శ్రీజ, పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎల్ఆర్ఎస్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటినీ కోసం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ బృందంలో నీటి పారుదల, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, సంబంధిత అధికారులు ఉండాలన్నారు. భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వ భూముల్లో, నీటి వనరుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో క్రమబద్ధీకరణకు అనుమతించొద్దన్నారు. భూక్రమబద్ధీకరణలో ఎక్కడైనా అవతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్ఆర్ఎస్ స్ర్కూటినీ పూర్తి చేసుకుని ఆమోదించిన దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ మార్చి31లోపు రాయితీ వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం మండలాల వారిగా అదనపు కలెక్టర్లు సమీక్షించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై వివరించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీపీవో ఆశాలత, డీఎల్పీఓ రాంబాబు, ఖమ్మం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ షఫీయుల్లా, తహసీల్దార్లు, ఎంపీడీవో, నీటిపారుదలశాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఒలింపియాడ్‌లో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో 61మంది గోల్డ్‌మెడల్స్, 40మంది బ్రాంజ్ మెడల్స్, మరో 16మంది స్కూల్ లెవల్ మెడల్స్ సొంతం చేసుకున్నారన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగి హక్కులను కాలరాసే ఏకీకృత పెన్షన్ విధానాన్ని రాష్ట్రంలోకి అనుమతించొద్దు, పాతపెన్షన్ పునరుద్ధరణ మాత్రమే ఉద్యోగి భవిష్యత్తుకు రక్షణ ఇవ్వగలదని సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ పునరుద్ఘాటించారు. మార్చి 2న ఏకీకృత పెన్షన్ విధానానకి వ్యతిరేకంగా హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన యుద్ధభేరి సన్నాహక కార్యక్రమ పోస్టర్‌ను కలెక్టరేట్ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. కాంగ్రెస్‌పార్టీ మెనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని అమలులోకి తీసుకురావాలని శశిధర్ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాసరావు, కోశాధికారి గుగులోత్ మోహన్, జిలానీ, కె.సంపత్, జాస్మీన్, గిరిజాకుమారి, రత్నం, స్నేహ, శ్రీనివాస్, వివిధ విభాగాల ఉద్యోగలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పనిచేయాలి

తిరుమలాయపాలెం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ లక్ష్యంగా పోరాటాలు నిర్వహించాలని ఎంఆర్పీఎస్ జిల్లానాయకుడు సీహెచ్ నాభూషణం అన్నారు. శనివారం తిరుమలాయపాలెంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి1(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణంలో యువతకు పలురంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత అన్నారు. ఈనెల 10లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ, విద్యా అర్హత ధ్రువపత్రాలు దరఖాస్తు చేయాలన్నారు. ఈశిక్షణ 15నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. టైలరింగ్, కంప్యూటర్, కార్, ఆటో డ్రైవింగ్, బ్యూటీషిన్, మగ్గం వర్క్సుల్లో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేద యువతి వివాహానికి సాయం



ఖమ్మంవ్యవసాయం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద యువతి వివాహానికి పుస్తె మెట్టెలు, చీర అందజేశారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప్పల ఫౌండేషన్ తరఫున ఖమ్మంలోని ఆర్యవైశ్య కుటుంబానికి ఈ సాయం అందజేశారు. జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, వాసవిక్లబ్ ఖమ్మం అధ్యక్షుడు, 36 డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహనరావు అభ్యర్థన మేరకు ఉప్పల ఫౌండేషన్ వారు పుస్తెలు మెట్టెలు చీర హైదరాబాదు నుంచి ఖమ్మం పంపారు. వాటిని డిస్టిక్ గవర్నర్ ఆఫీస్‌లో పెళ్లికూతురు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి దివాకర్ గుప్తా కురువెళ్ళ కాంతారావు, బచ్చు మురళీకృష్ణ, వేచ్చా హరిబాబూ ఆకుల సతీష్ ఆత్మకూరు వెంకట రామారావు పాల్గొన్నారు.

ఘనంగా టైనిటాట్స్ సిల్వర్‌జూబ్లీ వేడుకలు



మెమోంటోలు అందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టైనిటాట్స్ పాఠశాల 25వవార్షికోత్సవం(సిల్వర్‌జూబ్లీ) శనివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మేయర్ నీరజ, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ హాజరయ్యారు. క్రమశిక్షణ, విద్యా విలువలకు మారుపేరుగా పాఠశాల ఉంటుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ మాట్లాడుతూ అత్యుత్తమ బోధనను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పోరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, న్యాయవాది మహ్మద్ అసద్, ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు కాంతారావు, ట్రెజరర్ నాసరయ్య, అశోక్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్య గ్లోబల్ విస్తా వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాల మొదటి వార్షికోత్సవాన్ని పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య జ్యోతిప్రజ్వల చేసి ప్రాంభించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో భవిష్యత్తులో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ శర్మ, జయసుధ, నాగప్రవీణ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీవిద్య, శ్రీధర్

ఘనంగా గీతాంజలి వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి1(ఆంధ్రజ్యోతి): నగరంలోని గీతాంజలి పాఠశాల 22వ వార్షికోత్సవాన్ని శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. డీఈవో సోమశేఖరశర్మ, ముష్వా శ్రీనివాసరావు, గుర్రం కాంతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని, తల్లితండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా ఉత్తమ క్రమ శిక్షణతో, విలువలతో విద్యనందిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు టి పద్మ, అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఈఓ, కరస్పాండెంట్ అప్పారావు

తీర్థాల ఆదాయం రూ.41 లక్షలు

ఖమ్మంరూరల్,మార్చి1(ఆంధ్రజ్యోతి):మండలపరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాలయం జాతర మూడురోజులకు హుండీ ఆదాయం రూ.41 లక్షల, 36 వేలు వచ్చింది. ఆలయం హుండీ లెక్కింపు శనివారం ఆలయ అధికారులు నిర్వహించారు. గతఏడాది రూ.38 లక్షల 67వేల ఆదాయం వచ్చింది. గత ఏడాదికంటే ఈ ఏడాది రూ.2లక్షల 68 వేల ఆదాయం పెరిగినట్లు తెలిపారు.

కరుణగిరిలో ఆధ్యాత్మిక వైభవం

ఖమ్మంరూరల్,మార్చి1(ఆంధ్రజ్యోతి):కరుణగిరి పుణ్యక్షేత్ర వేడుకల్లో మూడోరోజు కరుణగిరి ప్రాంగణంలో ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. రెండురాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. శనివారం జరిగిన వేడుకల్లో విశాంత బిషప్ మైపన్‌పాల్ మాట్లాడుతూ కరుణగిరి దివ్యక్షేత్రం భక్తుల బలమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కరుణగిరి క్షేత్ర నిర్మాణంలో తాను పూర్తి బాధ్యతతో నిర్వహించడం గొప్పదైవ కార్యంగా భావిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో ఖమ్మం మేత్రాసనం బిషప్ సగిలి ప్రకాష్, డైరెక్టర్ మాథ్యూ వరప్రసాద్,కర్నూల్ ఆర్‌సిఎం పీఠాధిపతి బిషప్ గోరంట్ల జ్యానేష్ తదితరులు పాల్గొన్నారు.

మసీద్‌ల వద్ద పారిశుధ్య పనులు

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో రంజాన్ పర్వ దినోత్సవాల సందర్భంగా కేఎంసీ అధికారులు గుర్తించిన 66 మసీద్‌ల్లో శనివారం కేఎంసీ పారిశుద్య విభాగం ప్రత్యేక పారిశుద్య పనులు చేశారు. జేసీబీలతో మసీదుల సమీపంలోని ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. సైడ్ డ్రైనేజీల్లోని వ్యర్థాలను తొలగించారు. మసీద్‌ల చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను కేఎంసీ పారిశుద్య గ్యాంగ్ బృందాల ఆధ్వర్యంలో పరిశుభ్రం చేశారు.



ఆంధ్రజ్యోతి ZONE
ఆదివారం 2 మార్చి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
8
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
WYRA, MADHIRA, SATHUPALLY



మూగజీవాలకు అందని వైద్యం

» ఖమ్మంపాడు పశువైద్యశాలలో రెండేళ్ల నుంచి ఖాళీగా వైద్యుడి పోస్టు » పట్టించుకోని అధికారులు

మధిర రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలోగల ప్రధాన పశు వైద్యశాలకు వైద్యుడి పోస్టు ఖాళీ గా ఉంది. రెండేళ్లుగా వైద్యుడి పోస్టు ఖాళీగా ఉన్న ప్పటికీ ఇక్కడ భర్తీ చేయ లేదు. ఇన్‌చార్జి వెటర్నరీ అసిస్టెంట్‌తోనే ఈ గ్రామం లో పశువైద్యశాల నడుపుతున్నారు. ఖమ్మం పాడు ప్రధా న పశువైద్యశాల కింద ఇల్లూరు, దెందుకూరు సబ్‌సెంటర్లు కూడా ఉన్నాయి. ఖమ్మంపాడుతోపాటు చుట్టూపక్కల గ్రామా లైన చిలుకూ రు, తొండలగోపారం, తొర్లపాడు, సాయిపురం గ్రామాల రైతులు కూడా ఇక్కడి వచ్చే తమ మూగజీవాలకు వైద్యం చేయించు కుంటూ ఉంటారు. పూర్తి వ్యవసాయ ఆధా రిత ప్రాం తం కావడంతో ఈ గ్రామాల్లో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు వంటివి ఎక్కువగా పెంచుతుంటారు. వైద్యుడి పోస్టు ఖాళీగా ఉండటంతో మూగజీవాలకు వ్యాధులు సంక్రమించినప్పుడు సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉందని స్థాని కులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండాపో యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వెటర్నరీ అసిస్టెంటే ఇక్కడ అన్నీ చూసుకోవాల్సి వస్తుంది. గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలకు సీజన్‌లో వ్యాధులొచ్చినప్పుడు పెంపకందార్లు వైద్యం చేయించేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రధాన ఆసుపత్రిగా ఉన్న ఈ వైద్యశాలకు పశువైద్యాధికారుడిని నియమించే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. పశువైద్యాధికారుడిని నియ మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఖమ్మంపాడు పశువైద్యశాల

డాక్టర్‌ను నియమించాలి



● చిన్నపుల్లారావు, రైతు, ఖమ్మంపాడు

తమ గ్రామంలో పశువై ద్యశాల ఉండి కూడా ఉప యోగం లేకుండాపోయింది. డాక్టర్ పోస్టు ఖా ళీగా ఉంది. రెబ్బవరం నుంచి ఇక్కడకు ఒక అసిస్టెంట్‌ను వేశారు. పలు గ్రామాలకు తమ ఆసుపత్రి ప్రధాన కేంద్రంగా ఉంది. పశువై ద్యాధికారి లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం చేయించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డాక్టర్‌ను నియమించాలి.

అధికారులు స్పందించాలి



● వెంకటేశ్వరరావు, రైతు, ఖమ్మంపాడు

తమ గ్రామంలోని పశువై ద్యశాలకు డాక్టర్‌ను నియ మించే విషయంలో జిల్లా అధికారులు పట్టించుకోవాలి. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు ఈ గ్రామంలో ఎక్కువగా ఉన్నారు. పశువులకు పెద్ద వ్యాధులు వచ్చినప్పుడు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నాం. రైతుల సమస్యను పరిష్కరించాలి.

గుత్తా అనంతరామయ్యకు మంత్రి తుమ్మల నివాళి

ఏన్కూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి): జన్నారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడు గుత్తా వెంకటేశ్వర రావు తండ్రి అనంతరామయ్య దశదినకర్మకు శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరామయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గుత్తా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, కొంబాల కోటేశ్వరరావు, లకావత్ తిరిబాబు, నున్నా నాగేశ్వరరావు, బూక్యావీరభద్రం, బాగం హేమంతరావు, స్వర్ణ నరేంద్రకుమార్ తదితరులున్నారు.


అనంతరామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వం

» తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు

కొణిజర్ల, మార్చి1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు విమర్శించారు. శనివారం కొణిజర్లలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దడిపిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మం డల రైతుసంఘం మూడవ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ నెల 20న వైరాలో రైతుసంఘం ఖమ్మం జిల్లా మహాసభ జరుగుతుందని, రైతులంతా అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వరరావు, స్వర్ణ రమేష్, తండు సమయ్య, తోటపల్లి సీతరాములు, తాతా బాబు, పెదమళ్ళ రత్తమయ్య పాల్గొన్నారు.

రైతుసంఘం మండల కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేరంగుల లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శిగా తండు సోమయ్య, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

పశువైద్య శిబిరం

సత్తుపల్లి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపురంలో గోపాలమిత్ర గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్లపల్లి పశువైద్యాధికారి శశిదీప్ పశువులను పరీక్షించి అవసరమైన వాటికి మందులను ఉచితంగా అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో గోపాలమిత్రల సూపర్‌వైజర్ బీ.లక్ష్మణ్, జేవీవో కిరణ్‌రెడ్డి, గోపాలమిత్రలు చాపల విజయకుమార్, ఎస్‌కే.సైదులు, వంకలపాటి రవి, రామకృష్ణ రాజు, చెన్నారావు, పొనుగుమాటి శేషగిరిరావు, పుచ్చకాయల వేణు పాల్గొన్నారు.

ఘనంగా తదియారాధన

సత్తుపల్లిరూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ గీతాజ్ఞానమందిరంలో శనివారం తదియారాధన కార్యక్రమం దాతల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులతో పాటు నిరుపేదలు, యాచకులకు ఆహార పొట్లాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కోరుకొండ వెంకటేశ్వరరావు, రోజాలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక

చింతకాని, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం మండల కమిటీని శనివారం గౌరవ అధ్యక్షుడు బాసా జానకిరామయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొన్నం రాంబాబు, కార్యదర్శిగా కేమ వెంకటేశ్వర్లు, కోశాధికారి చిదిరాల కోటేశ్వరరావు, సభ్యులుగా జిల్లా యాదాద్రి, జిల్లా ప్రసాదు, జిల్లా శివాజీ, మేకల సాయిబాబా, రాంబాబు, మహేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోతుకూరి సత్యం, కాముని కోటయ్య, మేకల వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ముదిగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన బాణోతు సుమన్, ఎర్రగడ్డ శేషుల ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను శనివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల స్పెషలాఫీసర్ ఇందిరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

10న బహిరంగ వేలం

ఏన్కూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి): గార్లోడ్డు శ్రీ లక్ష్మినర్సింహస్వామి దేవాలయ ప్రాంగణం నందు లడ్డూప్రసాదం, పులిహోర విక్రయించేందుకు మార్చి10న సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిగంటలకు దేవాదాయకమిషనర్ ఖమ్మం కార్యాలయం నందు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించాలని కోరారు.

బీమా నగదు అందజేత


నగదును అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు

ఎర్రుపాలెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన గామాసు నారాయణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నారాయణమ్మకు అయ్యవారిగూడెం వ్యవసాయ సహకారసంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును ఆమె భర్త జోగయ్యకు సొసైటీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, డీసీసీబీ మేనేజర్ దివ్య ఎర్రుపాలెం డీసీసీబీ బ్యాంక్‌లో అందించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జాని, సీఈవో మోహన్‌రావు, మురళి, రమణరెడ్డి పాల్గొన్నారు.

రాయపట్నం వాసికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన విశ్వప్రసాద్

మధిర రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ రాయపోలు విశ్వప్రసాద్‌కు హానరీ డాక్టరేట్ అవార్డు కౌన్సిల్(హెచ్‌డీఏసీ) వరల్డ్ హ్యూ మన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్(డబ్ల్యూహెచ్‌ఆర్‌పీసీ)ద్వారా డాక్టరేట్ అందుకున్నారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీఏ ఫైనాన్స్ కాంచీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ బోధిస్తున్నారు. గౌరవ డాక్టరేట్‌తోపాటు ప్రతిష్టాత్మక జీవితకాల అవార్డును డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ వారు అందజేశారు. విద్యారంగంలో గణిత శాస్త్ర బోధనలో ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. అంతర్జాతీయ జర్నల్స్‌లో ఏడు పరిశోధన పత్రాలు ప్రచురించడంతోపాటు అంతర్జాతీయ సదస్సుల్లో రెండు పరిశోధనా పత్రాలను సమర్పించారు.

మక్కరైతులు ఆందోళన చెందొద్దు

» జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య


వల్లాపురంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

వైరా, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కోసం మొక్కజొన్న రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని వల్లాపురం గ్రామంలోని శనివారం క్షేత్రస్థాయిలో పుల్లయ్య పర్యటించారు. ఆగ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఎన్నెస్పీ కాల్వల కింద సాగుచేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి సాగర్‌జలాల లభ్యత గురించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారబందీ ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తమకు సక్రమంగా సాగర్‌జలాలు రావడం లేదని, సకాలంలో సాగర్‌జలాల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. స్పందించిన పుల్లయ్య మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగర్‌జలాలు అందిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వైరా ఏడీఏ తుమ్మల కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవోలు సపావత్ సైదులు, ఎం.రాజేష్, ఆదర్శ రైతు తుమ్మల రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

బోనకల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా వ్యాప్తంగా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు తహసీల్దార్ పున్నమ్ చందర్, పంచాయతీరాజ్ అధికారులు హాజరయ్యారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి మండలంలో 808 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

బోనకల్‌లో-380, చిరునోములలో-107, గార్లపాడులో-1, జానకీపురంలో-3, కలకోటలో-3, మోటమర్రిలో-1, ముష్టికుంట్లలో-4, పెద్దబీరవల్లిలో-6, రావినూతలలో-124, సీతానగరంలో-1 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల 31వ తేదీ నాటికి రెగ్యూలైజేషన్ ప్రకియ పూర్తయ్యేలా చూడాలని వీడియోకాన్ఫరెన్స్‌లో స్పష్టం చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

వైరాలో బలవంతపు పన్నుల వసూళ్లు నిలిపివేయాలి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

వైరా, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):వైరా మునిసిపాలిటీలో భారీగా పన్నులు పెంచిన అధికారులు వాటిని బలవంతంగా వసూలు చేసే కార్యక్రమాన్ని నిలిపివేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మచ్చా మణి అధ్యక్షతన శనివారం జరిగిన సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. నిర్బంధంగా ఇంటిపన్నులు వసూలు చేయటాన్ని నిలిపివేయకపోతే దశలవారీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొంతు సమత, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల మోహన్‌రావు, రజిత, అనుమోలు రామారావు, గుమ్మా నర్సింహారావు, తోట కృష్ణవేణి, సామినేని రవి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

తల్లాడ/మధిరటౌన్/ముదిగొండ/చింతకాని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం తల్లాడ, మధిరటౌన్, ముదిగొండ, చింతకానిలలో నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలల్లో ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, ఇస్నేపల్లి అశోక్‌మాదిగ, కూరపాటి సునిల్, కనకపుడి శ్రీను, గద్దల వెంకటేశ్వర్లు, ఎడిశాల నాగేశ్వరరావు, బొడ్డు అనిల్, నూకల నాగేశ్వరరావు, చిర్రా ఉపేందర్, పగిడిపల్లి రవీందర్, కొమ్ము జానురాజు తదితరులు పాల్గొన్నారు.


ముదిగొండలో మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

వీడ్కోలు సమావేశం


మధిరటౌన్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సత్తుపల్లిరూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని శ్రీ కాకతీయ, గాయత్రి జూనియర్ కళాశాలల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్ రావు అన్నారు. శనివారం గాయత్రి కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్స్ జీ.వీ రారెడ్డి, జీ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్.సుబ్బారావు తదితరులున్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్,మార్చి1(ఆంధ్రజ్యోతి): మధిరలోని శ్రీనిధి డిగ్రీ కళాశాల, టీవీఎం ప్రభుత్వ పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను చంద్రశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మధిర సీఐ మధు, కళాశాల చైర్మన్ అనిల్ కుమార్ నెహ్రూ, పిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఏవో సాంబ, ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఉన్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు: ఏన్కూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పదోతగరతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం చంద్రిక, ఉపాధ్యాయులు సుభాషిణి, నిర్మల, లలిత, నాగమణి, చైతన్యభారతి, సత్యవతి, నరసయ్య పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిలో ఏడు ఇంటర్ పరీక్షా కేంద్రాలు


బాక్సులను పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

సత్తుపల్లిరూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ పరీక్షలకు సత్తుపల్లిలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కస్టోడియన్, పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు ప్రశ్నాపత్రాలు షీల్డ్ బాక్సులలో డిపాజిట్ అవ్వగా జాబితా ప్రకారం అన్నీ ఉన్నాయా లేదా అని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అయితే సత్తుపల్లిలో ప్రభుత్వ, ప్ర యివేట్ జూనియర్ కళాశాలలతో పాటు గాయత్రి, శాంతినికేతన్, టెక్నో, శ్రీవాణి, విద్యాభారతి కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపికచేశారు. మొదటి సంవత్సరంలో 1,687, రెండో సంవత్సరంలో 1,456మంది కాగా మొత్తం 3,143మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

'ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి'


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ముదిగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఖానాపురం గ్రామంలోని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు శనివారం తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 17మంది లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపిక చేశారని, అర్హులైన మిగతా వారిని కూడా ఎంపిక చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకట్, మాలోజి గోవిందు, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పూజలు

తల్లాడలో...

తల్లాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని హన్మత్ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా హోమంపూజలు నిర్వహించారు. స్వామివారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణచార్యులు, ప్రధాన అర్చకులు దివి సీతరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి హోమ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శేషగిరిరావు, గుణాకర్, పసుమర్తి చిన్నభద్రయ్య, కృష్ణారావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నవహ్నిక ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

కిష్టారం గ్రామాన్ని కాపాడండి

సత్తుపల్లిరూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఓసీ కాలుష్యం నుంచి కిష్టారం గ్రామాన్ని కాపాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఇఫ్టూ నాయకులు గౌని నాగేశ్వరరావు, జే.సీతరామయ్యలు డిమాండ్ చేశారు. సైలో బంకర్‌కు వ్యతిరేకంగా 20రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన మండలంలోని కిష్టారంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులకు శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌కే.ఉమర్, కుంజా కృష్ణ, రాఘవులు, కొండపినేని సత్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో కనకదుర్గ

వేంసూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాలు, సెల్‌ఫోన్ వాడటం వలన కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం బీరాపల్లి సర్కిల్ పరిధిలోని బీరాపల్లి, శంభునిగూడెం, చిన్నమల్లెల, కుంచపర్తి గ్రామాల్లో సీడీపీవో కనకదుర్గ ఆధ్వర్యంలో చిన్నారి ముచ్చట్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, సామాజిక కార్యకర్త హరిప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





